సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 27 । నవంబర్ । 2024



'రాజ్యాంగ' వేడుకల్లో ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: పాతపార్లమెంట్ సెంట్రల్ హాలులో మంగళవారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఎంపీలు నగేశ్, రఘునందన్ రావు, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆ ప్రజాహిత వ్యాజ్యం కొట్టివేత

కైలాస్‌నగర్: భారత ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానం ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ప్రకటనలో తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై పిటిషనర్ వాదనలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని పేర్కొన్నారు. ఈవీఎంలతో ఎలాంటి ఇబ్బందులు లేనట్లుగా న్యాయమూర్తులు జస్టిస్ విక్రమనాథ్, జస్టిస్ పిబి.వరాలేతో కూడిన ధర్మాసనం వెల్లడించినట్లుగా ఆమె తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.0/11.0

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రతతో పాటు గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, మహాత్మ జ్యోతి బాపూలే వసతి గృహాలను మంగళవారం తనిఖీ చేశారు. మెనూ చార్టును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం అందుతున్న తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.

నేడు విధుల్లోకి కలెక్టర్

కైలాస్‌నగర్: కలెక్టర్ రాజర్షిషా బుధవారం విధుల్లో చేరనున్నారు. ఈ నెల 23నుంచి సెలవుపై వెళ్లిన కలెక్టర్ తిరిగి నేటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో టి.ప్రణీత అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలం యాపల్‌గూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పలువురు ఎస్సైల బదిలీ



డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాంసి ఎస్సై రాధిక

ఆదిలాబాద్‌టౌన్: బేల ఎస్సైగా పనిచేస్తున్న రాధిక తాంసికి బదిలీ అయ్యారు. అలాగే తాంసిలో పని చేస్తున్న ఎస్సై శివరామ్ సిరికొండ(ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న)కు బదిలీ అయ్యారు. అయితే బేల ఎస్సైగా ఇదివరకు జిల్లాలో పనిచేసిన దివ్యభారతి నిర్మల్ నుంచి రానున్నారు. ఈ మేరకు ఎస్పీ గౌస్ ఆలం మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాధిక ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆదివాసీ హక్కుల కోసం నిరంతర పోరాటం



దాదిరావును సన్మానిస్తున్న నాయకులు

నార్నూర్: ఆదివాసీ హక్కుల కోసం తుడుందెబ్బ నిరంతర పోరాటాలు చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. మండల కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను ఆదివాసీ సంక్షేమ పరిషత్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ నినాదంతో నాడు ఆదివాసీ బిడ్డ కుమురంభీం పోరాటం చేశారని, అదే స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడు తూ జాతి సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షుడు మేస్రం మాణిక్యరావు, డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మండలఅధ్యక్షుడు శ్రీరామ్, ఈస్రు, మాన్కు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో 15 రోజుల క్రితం ఫుడ్‌పాయిజన్ కావడంతో తొమ్మిదో తరగతి విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది.
- నారాయణపేట్ జిల్లా మగనూర్‌లోని జెడ్పీఎస్ఎస్‌లో ఫుడ్‌పాయిజన్ కావడంతో సుమారు వంద మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. మరుసటి రోజు అదే పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో డీఈవో, ఎంఈవో, ఇన్‌చార్జి హెచ్‌ఎంతో పాటు పలువురు అధికారులపై ఆ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చర్యలు చేపట్టారు.
- ఆదిలాబాద్ జిల్లాలో ఇదివరకు రూరల్ కేజీబీవీ, భీంపూర్ కేజీబీవీ, తాంసి మండలంలోని బండల్‌నాగపూర్, నేరడిగొండ కేజీబీవీలో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కేజీబీవీ ప్రత్యేక అధికారులతో పాటు పాఠశాలల ఉపాధ్యాయులపై అప్పట్లో విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు.



ఆదిలాబాద్ పట్టణంలోని బాలికల పాఠశాలలో ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకున్న విద్యార్థినులు

మధ్యాహ్నం.. అధ్వానం

- సర్కారు పాఠశాలల్లో కానరాని మెనూ
- వారానికి ఒకట్రెండు రోజులే కోడిగుడ్డు
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం
- తరచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలు
- పలుచోట్ల ఇంటి భోజనమే దిక్కవుతున్న వైనం

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు..

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	925	46,344
ప్రాథమికోన్నత	111	25,122
ఉన్నత	110	12,089

ఆదిలాబాద్‌టౌన్: పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ కారణంగా విద్యార్థులు ఆస్పత్రి పాలవుతున్నా అధికారుల తీరులో మాత్రం మార్పు రావడం లేదు. నాణ్యమైన భోజనం వండిపెట్టాల్సిన నిర్వాహకులు అలసత్వం వీడడం లేదు. వెరసి విద్యార్థుల పాలిట శాపంగా మారుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల సంఘటనలు చోటు చేసుకుంటున్నా అడ్డుకట్ట పడటం లేదు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుంది. కూరగాయలు, ఆకుకూరలు, ఉడికించిన కోడిగుడ్లు, అరటిపండ్లు అందించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో మెనూ ప్రకారం అమలుకు నోచుకోవడం లేదు. ఉడకని అన్నం, నీళ్ల పప్పు, అప్పుడప్పుడు అన్నంలో పురుగులు రావడం వంటి ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఇటీవల కుమురంభీం జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కారణంగా ఓ విద్యార్థి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఘటనలు పునరావృతం అవుతున్నాయనే విమర్శలున్నాయి.

నాసిరకం భోజనమే దిక్కు..

విద్యార్థులకు అన్నంతో పాటు పప్పు, ఆకుకూరలు, కూరగాయలు అందించాల్సి ఉంటుంది. అయితే చాలా పాఠశాలల్లో నీళ్ల చారు, టమాట, ఖిచిడి మాత్రమే వండి పెడుతున్నారు. ఇదేమిటని నిర్వాహకులను అడిగితే, మధ్యాహ్న భోజనం బిల్లులు రాక అవస్థలు పడుతున్నామని, అప్పు వండి పెడుతున్నామని పేర్కొంటున్నారు. అయితే కొంత మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినలేక ఇంటి నుంచే బాక్సులు తీసుకొచ్చుకుంటున్నారు. గత్యంతరం లేని వారు నిర్వాహకులు వండిన భోజనమే తినాల్సిన వస్తోంది.

పర్యవేక్షణలోపం..

మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మండల విద్యాధికారులు ప్రతిరోజు మూడు పాఠశాలలను పర్యవేక్షించాల్సి ఉండగా కార్యాలయానికే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులకు భోజనం అందించే సమయంలో పర్యవేక్షించి వారు తినే వరకు అక్కడే ఉండాలి. కానీ చాలా పాఠశాలల్లో అలా జరగడం లేదు. దీంతో తరచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలతో పాటు అన్నంలో పురుగులు రావడం, నీళ్ల పప్పు వంటి నాసిరకం భోజనం విద్యార్థులకు అందుతున్నట్లు తెలుస్తోంది.

భోజనంలో గుడ్డు మాయం..

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు కోడి గుడ్డు అందించాల్సి ఉంటుంది. అయితే ఒకట్రెండు రోజులు మాత్రమే అందిస్తున్నట్లు తెలుస్తోంది. గుడ్డు ధర మార్కెట్లో రూ.7 ఉండగా, ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తుంది. ఒక్కోగుడ్డుపైనే రూ.2 అదనపు భారంగా మారుతుంది. అలాంటిది మూడు రోజుల పాటు గుడ్లను అందించాలంటే ఆర్థిక ఇబ్బంది అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నిచోట్ల వారానికి ఒక్క రోజుతోనే సరిపెడుతున్నారు. తక్కువ పిల్లలున్న పాఠశాలల్లో అతి కష్టం మీద రెండు రోజులు గుడ్డును అందిస్తున్నారు.

నాణ్యమైన భోజనం అందిస్తున్నాం..

మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చూస్తున్నాం. మండల విద్యాధికారులు పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తున్నాం. – ప్రణీత, డీఈవో

మండలాలు @21

- జిల్లాలో కొత్తగా మూడు ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆయా గ్రామాల ప్రజల్లో హర్షం



కొత్తగా ఏర్పడిన సొనాల మండలకేంద్రం



ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు

కైలాస్‌నగర్: జిల్లాలో రెవెన్యూ మండలాల సంఖ్య 21కి చేరింది. ఇప్పటి వరకు 18 ఉండగా కొత్తగా మూడు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాత్నాల, సొనాల, భోరజ్‌కు మండల హోదా కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఎంఎస్ నంబర్ 67ను ద్వారా వెల్లడించింది. త్వరలోనే ఆయా మండల కేంద్రాల్లో పరిపాలన వ్యవహారా లు షురూ కానున్నాయి. ఏడాదిగా నిరీక్షిస్తున్న ఆయా మండలాల్లోని ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు త్వరలో మండల పరిషత్ ఎన్నికల్లో ఆయా చోట్ల నూతన పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. ఈ క్రమంలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఏడాది నిరీక్షణకు తెర..

పరిపాలన సౌలభ్యం పేరిట గత ప్రభుత్వం జిల్లాలను పునర్వ్యవస్థీకరించడంతో పాటు కొత్తగా మండలాలను సైతం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు బోథ్ మండలంలోని సొనాల, జైనథ్ మండలంలోని భోరజ్, సాత్నాల మండలాలను ఏర్పాటు చేస్తూ ఎన్నికల సమయంలో జీవో జారీ చేశారు. ఆయా మండలాల్లో పరిపాలన వ్యవహారాలు నిర్వహించేందుకు వీలుగా అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆయా మండల కేంద్రాల్లో పర్యటించి ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. వాటిని సిద్ధం చేసే దశలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ప్రక్రియకు బ్రేక్ పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండలాలు కావడంతో కాంగ్రెస్ సర్కారు అందుకు అనుమతిస్తుందా లేదా అనే దానిపై రాజకీయ పార్టీలతో పాటు ఆయా ప్రాంతాల ప్రజల్లో సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త మండలాలు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సమగ్ర సర్వేలో కొత్త మండలాలకు కోడ్‌లు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త మండలాలకు సైతం కోడ్‌లు కేటాయించడం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. జైనథ్ మండలంలోని సాత్నాలకు 20, భోరజ్‌కు 21, బోథ్ మండలంలోని సొనాలకు 19 కోడ్‌లను కేటాయించడంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన మండలాల ఏర్పాటుకు సుముఖంగా ఉందనే విషయం స్పష్టమైంది. సర్వే పూర్తయ్యేలోపే జైనథ్ మండలంలోని 21 గ్రామ పంచాయతీలతో భోరజ్ మండలంగా, అలాగే బోథ్ మండలంలో కొనసాగుతున్న సొనాల మండలాన్ని 12 గ్రామ పంచాయతీలతో ఏర్పాటు చేశారు. ఇక జైనథ్, ఆదిలాబాద్ రూరల్, బేల మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ కొత్తగా సాత్నాల మండలాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సొనాల మండలానికి సంబంధించి గతంలోనే గెజిట్ నోటిఫికేషన్ జారీ కాగా పాలన వ్యవహారాలు ప్రారంభం కాలేదు. తాజాగా ఈ మూడు మండలాలకు సంబంధించిన గెజిట్ నో టిఫికేషన్‌ను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనుంది. ఎట్టకేలకు ప్రజల నిరీక్షణకు తెరపడనుండగా స్థానిక పరిపాలన వారికి చేరువ కానుంది.

ప్రజల ఆకాంక్ష నెరవేరింది



సొనాలను మండలంగా ప్రకటించాలని కొంత కాలంగా ఇక్కడి ప్రజలు ఉద్యమాలు నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల పోరాటాన్ని గుర్తించి మండలాన్ని ఏర్పాటు చేస్తూ గెజిట్ కూడా విడుదల చేసింది. అప్పటి అధికారులు భవనాలు సైతం పరిశీలించినా పరిపాలన మాత్రం ప్రారంభం కాలేదు. ప్రజల పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి ఎట్టకేలకు సొనాల కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయం.
– తుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోథ్

బీఆర్ఎస్ సంబరాలు



మాజీ సీఎం, మాజీ మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నూతన మండలాల ఏర్పాటును హర్షిస్తూ బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, జోగు రామన్న ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. జైనథ్ మాజీ ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన సొనాల, సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఇందులో నాయకులు విజయ్, ఊశన్న, ప్రభాకర్, వేణుగోపాల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఫోర్స్..

- శిక్షణ పూర్తయిన కానిస్టేబుళ్ల రాక
- ఈ నెల 30న జిల్లాలో చేరిక
- పోస్టింగ్ ప్రక్రియకు ఎస్పీ కసరత్తు



ఆదిలాబాద్ శిక్షణ కేంద్రంలో కొత్త కానిస్టేబుళ్లకు ఆయుధ వినియోగం తీరును వివరిస్తున్న ఎస్పీ (ఫైల్)

సాక్షి,ఆదిలాబాద్: జిల్లాకు కొత్త కానిస్టేబుళ్లు వస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు పోలీసు శిక్షణ కేంద్రాల్లో ట్రెయినింగ్ పూర్తి చేసుకున్న వారికి దీక్షాంత్ పరేడ్ నిర్వహించిన విషయం విదితమే. పాసింగ్ అవుట్‌పరేడ్ ద్వారా బయటకు వచ్చిన వారు ఇక క్షేత్రస్థాయిలో విధుల్లో చేరనున్నారు. ఈనెల 30న కొత్త కానిస్టేబుళ్లు జిల్లాలో రిపోర్టు చేయాల్సి ఉంది. తద్వారా ఎంత మంది చేరుతారనేది అదే రోజు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

ఖాళీలు భర్తీ అయ్యేనా..

జిల్లాలో సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్ల పోస్టులు 300 వరకు ఖాళీలు ఉన్నట్లు పోలీసు శాఖ తెలుపుతుంది. ఈనెల 30న కొత్త ఫోర్స్ రానుండగా, వారి ద్వారా ఈ ఖాళీలన్ని భర్తీ అవుతాయా.. లేదా అనేది చూడాల్సిందే. జిల్లా నుంచి 219 మంది కానిస్టేబుల్ శిక్షణ పొందారు. జడ్చర్ల, యూసుఫ్‌గూడలో పురుషులు, హైదరాబాద్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లు జిల్లాకు చెందినవారు శిక్షణ పొందారు. ఇందులో సివిల్ కానిస్టేబుళ్ల పరంగా 94 మంది పురుషులు, 46 మంది మహిళలు, ఏఆర్ పరంగా 63 మంది పురుషులు, 16 మంది మహిళలు ఉన్నారు. వీరంతా జిల్లాలోనే రిపోర్టు చేస్తారా.. ఎవరైనా వేరేచోట పోస్టింగ్ తీసుకుంటారా అనేది చూడాల్సిందే. తద్వారా ఆ రోజు రిపోర్టు చేసిన వారి సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

కొత్త పీఎస్‌లు ఏర్పాటయ్యేనా..

తాజాగా ప్రభుత్వం జిల్లాలో మూడు కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భోరజ్, సొనాల, సాత్నాల మండలాలు ఏర్పాటయ్యాయి. ఆయా మండలాల్లో కొత్త ఠాణాలను కూడా ఏర్పాటు చేయాల్సి వస్తుంది. దానికి అనుగుణంగా ఎస్సైతో పాటు కానిస్టేబుళ్లను నియమించాల్సి ఉంటుంది. శాంతిభద్రతల పరిరక్షణలో కానిస్టేబుళ్ల బాధ్యత కీలకం. ఖాళీల కారణంగా ప్రస్తుతం డ్యూటీ నిర్వహించే వారిపై అదనపు భారం పడుతుంది. ఈ నేపథ్యంలో కొత్త కానిస్టేబుళ్ల రాకతో కొంత ఊరట లభించే అవకాశం ఉంది.

ఆ రోజే తెలుస్తుంది..

జిల్లాలో శనివారం కొత్త కానిస్టేబుళ్లు రిపోర్టు చేయనున్నారు. తద్వారా ఆ రోజే ఎంత మంది ఇక్కడ చేరుతారనేది సంఖ్య తెలుస్తుంది. వారికి పోస్టింగ్ కల్పిస్తాం.
– గౌస్ ఆలం, ఎస్పీ

రాజ్యాంగాన్ని గౌరవించాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్‌టౌన్: భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ హక్కులతో పాటు బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం, వైస్ ప్రిన్సిపాల్ రఘు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ చంద్రకాంత్, ప్రోగ్రాం అధికారులు యాఖుబ్ అలీ, పృథ్వీరాజ్, గోపాల్, ముబారక్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ

కైలాస్‌నగర్: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి హాజరై ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన వివరాలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో చేపడుతున్న డాటా ఎంట్రీ ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. తహసీల్దార్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడి వివరాలపై ఆరా తీశారు. ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ప్రతీ దరఖాస్తు వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. సందేహాలుంటే సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. ఆమె వెంట మావల తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులున్నారు.



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 22న 'ఒకే సెంటర్.. వేర్వేరు రిపోర్టులు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ స్పందించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రెండు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్కానింగ్ చేస్తున్న వారికి అర్హతలు ఉన్నాయా.. డయగ్నోస్టిక్ సెంటర్లు నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, స్కానింగ్ రిపోర్టులు సక్రమంగా అందించాలని, అర్హత లేనివారితో పరీక్షలు చేయిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే బోర్డుపై వాటి ధరలు ప్రదర్శించాలని ఆదేశించారు. ఆయనవెంట జిల్లా మాస్ మీడియా అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది రాము తదితరులు ఉన్నారు.

రిమ్స్‌లో ఎన్‌సీడీ క్లినిక్ ఏర్పాటు చేయాలి

- వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేబుల్ డిసీస్) ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల నుంచి వచ్చే బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈసీజీ, టుడిఇకో తదితర పరీక్షలు చేయించాలని సూచించారు. ఇందుకోసం ఓ వైద్యుడితో పాటు సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు అసంక్రమిత వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని పాత థియేటర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు అనిల్ కథనం ప్రకారం.. రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లగా రాత్రి సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇస్త్రీకి వచ్చిన బట్టలు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాన్సీనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన రాజశేఖర్ మంగళవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా జాన్సీనగర్ వద్ద ఎదురుగా వచ్చిన క్యాంపర్ వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

మూడు మూగజీవాలు సజీవ దహనం

ఉట్నూర్‌రూరల్: విద్యుదాఘాతంతో మూడు మూగజీవాలు సజీవ దహనమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగంగాపూర్‌కు చెందిన సొగల సాయన్న సోమవారం రాత్రి తన రెండు ఎడ్లు, ఆవును పశువుల పాకలో కట్టేశాడు. విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగడంతో మూడు మూగజీవాలు సజీవ దహనమయ్యాయి. వాటితో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, పంటలకు వినియోగించే మందులు దగ్ధమయ్యాయని, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ అన్నారు. సోమవారం ఉట్నూరు డిపోకు చెందిన బస్సు ఢీకొట్టి జైనథ్ మండలంలో ఇద్దరు మృతి చెందడంతో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రతీ ఉద్యోగి పాటుపడాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో పొగమంచు వలన సైతం ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై దయానంద్ పాల్గొన్నారు.

వరంగల్ హైవే భూపరిహారం పెంపు



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి టేకుమట్ల, ఎల్కంటి, నర్సింగాపూర్, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, రొమ్మిపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న వరంగల్-విజయవాడ నేషనల్ హైవే రోడ్డులో నష్టపోతున్న భూములకు ఎకరాకు సుమారు రూ.20 లక్షల వరకు పరిహారం పెంచినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. మంగళవారం రొమ్మిపూర్ శివారులో రైతులతో మాట్లాడారు. చెట్లు, బోర్లు, పైపులు నష్టపోతున్న రైతులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకుముందు నర్సింగాపూర్, కుందారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి గన్నీ సంచుల కొరతలేకుండా చూడాలని ఆదేశించారు.

విరిగిన 33కేవీ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో సపోర్టు వైరు తెగిపోవడంతో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో అర్లి(టి) సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఏఈ తిరుపతి రెడ్డి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



అతిథుల కిలకిలలు

- శీతాకాల విడిదికోసం చెన్నూర్ అటవీ ప్రాంతానికి పక్షుల వలస
- గోదావరి, ప్రాణహిత తీరంలో సందడి
- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం రాకతో వెలుగులోకి..

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ బృందం సభ్యులు రెండురోజుల పాటు పర్యటించారు. సౌత్ ఆఫ్రికా నుంచి వివిధ రకాల పక్షులు, సీతాకోక చిలుకలు వలస వచ్చినట్లు గుర్తించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని శివ్వారం, గొల్లవాగు ప్రాజెక్ట్, అర్బన్ ఏకో పార్క్‌లలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్, హర్షన్, సోహన్ నాలుగు రోజుల క్రితం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో సర్వేశ్వర్, చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో చెన్నూర్, మంచిర్యాల, నీల్వాయి రేంజ్ అధికారులతో కలిసి పక్షి జాతులపై సర్వే నిర్వహించారు. చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో ఉండడంతో అరుదైన పక్షులు సౌత్ ఆఫ్రికా నుంచి శీతాకాల విడిది కోసం వలస వస్తున్నాయి. చెన్నూర్ అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులు, 72 రకాల సీతాకోకచిలుకలను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు. – చెన్నూర్

ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలి

- బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్

బాసర: ప్రజాస్వామ్య దేశంలో ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగంలో పొందుపర్చబడిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను గౌరవించాలని బాసర ట్రిపుల్ ఐటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం శాశ్వతమైన విలువలను, మార్గదర్శక సూత్రాలుగా కొనసాగిస్తుందన్నారు. ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ మన వ్యవస్థలన్నీ రాజ్యాంగంతో ముడిపడి ఉంటాయన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, కన్వీనర్ డాక్టర్ అజయ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

ఓరియంట్ కంపెనీ పనుల అడ్డగింత

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ గుట్ట ప్రాంతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ వేస్తున్న హద్దురాళ్ల పనులను మంగళవారం స్థానిక ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు, పీసా గ్రామ సభ లేకుండా గుట్ట ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. కంపనీ యాజమాన్యం దొంగచాటుగా హద్దులు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కంపనీ సున్నపురాయి లీజు పొడిగింపులో అటవీ భూములు తీసుకుంటుండటంతో రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఆధ్వర్యంలో రొట్టెపల్లి ప్రాంతంలో కంపనీ భూములు తీసుకుని అటవీశాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంతో అడ్డుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, కోవ వినోద్, చిక్రం రాందాస్, సిడం తిరుపతి, చిక్రం లింగారావ్, తదితరులు పాల్గొన్నారు.



పనులు అడ్డుకుంటున్న ఆదివాసీ నాయకులు

భార్యను చంపిన కేసులో జీవితఖైదు

కుభీర్(ముధోల్): భార్యను చంపిన కేసులో భర్తకు జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ మంగళవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రలోని సిరంజనికి చెందిన బాలాజీకి మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన నవనీతతో 2011లో వివాహమైంది. భార్యపై అనుమానం పెంచుకున్న బాలాజీ తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవకు దిగేవాడు. పెద్దలు నచ్చజెప్పడంతో మండలంలోని రాజూరాకు మకాం మార్చారు. అక్కడ కూడా గొడవలు జరగడంతో నవనీత పుట్టింటికి వెళ్లిపోయింది. 2020 అక్టోబర్ 1న బెల్గాంకు వెళ్లి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ 12న మృతి చెందింది. మృతురాలి బంధువు ముడుగుల పరశురాం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ఉమేశ్ కేసు నమోదు చేయగా ఎస్సై ఎల్.ప్రదీప్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ 20మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

బాసర హుండీల లెక్కింపు

- 89 రోజుల ఆదాయం రూ.1,00,30,657

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం ఆలయ అక్షరాభ్యాస మండపంలో ఈవో విజయరామారావు, వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ ఆధ్వర్యంలో లెక్కించారు. 89 రోజుల హుండీ ఆదాయం రూ.1,00,30,657 నగదుతోపాటు మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 4.250 కిలోలు వచ్చినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ నోట్లు 147 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఎస్‌బీఐ బ్యాంక్, పోలీసు సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటీ సభ్యులు, శ్రీశైల భ్రమరాంభిక సేవాసమితి కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో సేవా సమితి సిబ్బంది

భర్తను హతమార్చిన భార్య



గులాల్ సర్కార్ మృతదేహం

ఆసిఫాబాద్: భార్య చేతిలో భర్త హతమైన సంఘటన కాగజ్‌నగర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామానికి చెందిన గులాల్ సర్కార్ (44) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గులాల్ సర్కార్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం కూడా దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య సరస్వతి క్రికెట్ బ్యాట్‌తో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కమలా సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సందీప్ పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో హాజీపూర్ మండలం ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ప్రకాశ్‌రాథోడ్ బంగారు పతకం సాధించాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమ్యారాణి, పీఈటీ కిరణ్‌కుమార్, అధ్యాపక బృందం సదరు విద్యార్థిని అభినందించారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- సర్వీస్ బుక్‌లో సంతకం చేయడం లేదని అఘాయిత్యం
- ఆర్డీవో కార్యాలయంలో పురుగుల మందు తాగిన వైనం

కైలాస్‌నగర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన గంట అభిషేక్ వీఆర్‌ఏగా పనిచేస్తూ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. 2021లో అదే మండలంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎర్రం నరేందర్‌తో పాటు వీఆర్‌ఏగా ఉన్న అభిషేక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. విచారణను ఎదుర్కొన్న నరేందర్ ప్రస్తుతం ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీపై వచ్చారు. అయితే ఇతరశాఖలో సర్దుబాటు అయిన అభిషేక్ ఇంకా సస్పెన్షన్‌లోనే ఉన్నారు. ఆయన ఇతరశాఖలో సర్దుబాటు అయిన ఆ ఉద్యోగి సర్వీస్ బుక్‌లో సంబంధిత తహసీల్దార్ సంతకం తప్పనిసరిగా అవసరముంది. దీంతో ఆదిలాబాద్ డీఏవోగా పనిచేస్తున్న నరేందర్ వద్దకు సంతకం కోసం వచ్చారు. ఆయన నిరాకరించడంతో వేదనకు గురైన అభిషేక్ సదరు అధికారి ఎదుటే పురుగుల మందు తాగాడు. దీంతో ఆందోళనకు గురైన ఆర్డీవో, కలెక్టరేట్ ఉద్యోగులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు ఆరా తీశారు. ఈ విషయమై ఆర్డీవో వినోద్ కుమార్‌ను సంప్రదించగా ఇతర శాఖలో సర్దుబాటు అయిన ఉద్యోగి ఎస్‌ఆర్‌లో ప్రొసీడింగ్ ప్రకారం సంబంధిత తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా జిల్లా కేంద్రానికి వచ్చి డీఏవోను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారన్నారు. ఎద్దైనా సమస్య ఉంటే సంబంధిత కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే సదరు వ్యక్తి ఘలాట సృష్టించాడన్నారు. సదరు వ్యక్తిపై డీఏవో స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు.



డీఏవో చాంబర్ ఎదుట బాధితుడు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి లాంగ్ టెన్నీస్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల బెల్లంపల్లిలోజరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, వర్షిత్, చరణ్ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 27నుంచి హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.నారా యణ, ఉపాధ్యాయులు అభినందించారు.

'శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 29న ఫుడ్‌పాయిజన్‌తో దాదాపు 60 మంది గిరిజన విద్యార్థినులు ఆస్పత్రిలో చేరగా శైలజ మాత్రం 25 రోజులుగా వెంటిలేటర్‌పై ఉండి సోమవారం తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

జైపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఐకే1ఏ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, మధుకర్ పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

మంచిర్యాలక్రైం: అనారోగ్యంతో ఉన్న భార్యను చూసేందుకు అత్తారింటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి భరతపు తిరుపతి (31) భార్య సోనియాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వారం రోజుల క్రితం కాలేజిరోడ్‌లోని పుట్టింటికి వెళ్లింది. భార్యను చూసేందుకు తిరుపతి సోమవారం రాత్రి బైక్‌పై అత్తారింటికి బయలుదేరాడు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



తిరుపతి (ఫైల్)

హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి..

తిరుపతి బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన తీరును పరిశీలిస్తే హెల్మెట్ పెట్టుకొని ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనలో అతని తలకు మాత్రమే బలమైన దెబ్బతగలడంతో మృతి చెందినట్లు చెబుతున్నారు.

కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయి దహనం

- 64 కేసుల్లో 522.544 కిలోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 2021 నుంచి వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని ఇన్సినేటర్ ఫ్యాక్టరీలో మంగళవారం దహనం చేసినట్లు సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసుల్లో పట్టుబడిన రూ.1,30,38.600 విలువైన 522.544 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి ఎఫ్‌ఎస్‌ఎల్ కొరకు శాంపిల్ తీయగా మిగిలిన మొత్తాన్ని కరీంనగర్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉందన్నారు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయించే, సేవించే వారి వివరాలు పోలీసులకు తెలియజేస్తే సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, సీసీఆర్‌బీ సీఐ సతీష్, ఆర్‌ఐ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

'ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి'

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదలు, ప్రభుత్వ రంగాల పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీనివాస్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవ రాజ్, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇరు కుటుంబాలపై కేసు నమోదు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్, సయ్యద్ ఆరీఫ్ వరుసకు సోదరులు. బషీర్ గతేడాది ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి భూమిని రూ.1.20 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరీఫ్ ఆయనకు పోటీగా ఈ ఏడాది రూ.1.50 లక్షలు చెల్లించి కౌలుకు తీసుకుంటానని భూయజమానికి చెప్పాడు. ఈ విషయంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇరు కుటుంబాలు దాడులకు పాల్పడడంతో సయ్యద్ ఆరీఫ్, షేక్ హీనా, జుబేర్, సాదిక్, బషీర్, తాహేర్‌కు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు.